# వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ

## ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్



1827-1890

# మహాత్మ జ్యోతిబా ఫూలే

**సామాజిక సంస్కరణల నాందికర్త - మహిళల విద్యాభివృద్ధికి రూపకర్త**

**మానవ హక్కుల అవిశ్రాంత పోరాట యోధుడు - సమసమాజ స్థాపన స్ఫూర్తి ప్రధాత**

మహాత్మ జ్యోతిబా ఫూలే గారి సంక్షిప్త జీవిత చరిత్ర - ఆశయాలు

ఆశయ సాధన కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు

# మహాత్మ జ్యోతిబా ఫూలే

మహాత్మ జ్యోతిబా ఫూలే 1827వ సంవత్సరం ఏప్రిల్ నెల 11వ తేది మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. వీరి తండ్రి పేరు గోవిందరావు ఫూలే. తన వయస్సు కేవలం 9 మాసాలు ఉన్నప్పుడే, జ్యోతిబా ఫూలే గారి తల్లి స్వర్గస్థులైనారు.

జ్యోతిబా ఫూలే వెనుకబడిన తరగతులకు చెందిన 'మాలి' అనే కులమునకు చెందినవారు. తండ్రి గోవిందరావు కూరగాయల వ్యాపారం చేసేవారు. అతి కొద్దిపాటి వ్యవసాయం కూడా వీరికి ఉండేది. తండ్రి మరియు చిన్నాన్న, పెదనాన్నలు పూల వ్యాపారంలో కూడా ఉండటంతో వీరి కుటుంబంలోని వారిని 'ఫూలే' లుగా గుర్తించబడడం, పిలవడం జరిగినది.

జ్యోతిబా ఫూలే చిన్నతనంలోనే అపారమైన తెలివితేటలను, చక్కని ప్రతిభాపాటవాలను ప్రదర్శించేవారు. అయినప్పటికీ, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా తన చదువును కొనసాగించలేక, స్వస్తి పలకాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటుపిమ్మట, కుటుంబ నిర్వహణ కొరకై తన తండ్రి గారికి వ్యవసాయంలో తోడ్పాటు అందించేవారు.

కానీ, జ్యోతిబా ఫూలేగారి తెలివితేటలను, ప్రతిభాపాటవాలను గుర్తించిన ఇరుగు పొరుగు వారు జ్యోతిబా ఫూలేగారి తండ్రికి నచ్చజెప్పి, వారిని ఒప్పించి పూణెలోని ఓ మిషనరీ పాఠశాలలో జ్యోతిబా ఫూలేను తిరిగి చేర్పించడం జరిగినది.

జ్యోతిబా ఫూలే గారి జీవితాన్ని మలుపు తిప్పిన ఓ ముఖ్యమైన సంఘటన 1848వ సంవత్సరంలో చోటుచేసుకున్నది. బ్రాహ్మణ కులమునకు చెందిన తన స్నేహితుడి పెళ్ళికి వెళ్ళిన జ్యోతిబాఫూలే, పెళ్ళి ఊరేగింపులో పాల్గొనిన కారణంగా అవమానమునకు గురి కావలసి వచ్చినది. బ్రాహ్మణులచే తక్కువ కులముగా పరిగణించబడే 'మాలి' కులమునకు చెంది ఉండి, బ్రాహ్మణుల పెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నందుకు, కార్యం అపవిత్రం కాబడినదని తన స్నేహితుని బంధువులు జ్యోతిబా ఫూలేను అవమానించి, దుర్భాషలాడడం జరిగినది. ఆ సంఘటన జ్యోతిబా ఫూలే మనస్సును ఎంతగానో కలచివేసినది. కులవ్యవస్థమీద మరియు సామాజిక అసమానతల మీద పోరాడాలని తను నిర్ణయం తీసుకొనేలా ఆ సంఘటన ప్రభావితం చేసినది. ప్రఖ్యాత రచయిత "థామస్ పైన్" వ్రాసిన 'మానవహక్కులు' అనే పుస్తకం కూడా తన ఆలోచనా విధానాన్ని మరియు ఆలోచనా సరళిని ఎంతగానో ప్రభావితం చేసింది. అణగారిన వర్గాలైన మహిళలు, వెనుకబడిన తరగతులకు చెందిన వారిని తగు విధంగా జాగృతి పరచడమొక్కటే, సామాజిక అసమానతలకు పరిష్కారమని జ్యోతిబా ఫూలే గట్టిగా భావించారు. ఆ క్రమంలోనే వివిధ అంశాలపై తగు అవగాహనను పెంపొందించుటకు అవసరమైన సామాజిక ఉద్యమానికి తెరలేపి, అలుపెరగని పోరాటం సల్పారు.

దాదాపు 200 సంవత్సరముల క్రితం ఊహకే జగుప్స కలిగించే ఆనాటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబా ఫూలే. భారతదేశ చరిత్రలోనే సామాజిక సంస్కరణలకు జ్యోతిబా ఫూలే ఆద్యుడని, నాందికర్తని మరియు పితామహుడని గుర్తింపబడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా ఫూలే ***(Mahatma Jyotiba Phule is the Father of Indian Social Revolution).***

- ☞ సామాజిక రంగంలోనే కాక, తన సేవలను అన్ని రంగాలలోనూ అందించి, తనదైన ముద్రను వేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా ఫూలే. బహుళ రంగాలను ప్రభావితం చేసిన ధీరోదాత్తుడు. జ్యోతిబా ఫూలే ఓ సాంఘిక సంస్కర్త మాత్రమే కాదు. తను ఓ కార్యశీలి, ఆలోచనాపరుడు, మేధావి, రచయిత, విద్యాదాత, తత్త్వవేత్త, మానవతావాది, స్ఫూర్తిప్రదాత మరియు దార్శనికుడు.
- ☞ స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి, ఆ దిశగా ఎనలేని సేవలు అందజేసిన మహామనీషి జ్యోతిబా ఫూలే. 1848వ సంవత్సరంలో మహిళల కొరకు ఓ ప్రత్యేక పాఠశాలను ఏర్పాటుచేశారు. తన అర్ధాంగి అయిన సావిత్రీ

భాయి ఫూలేకు విద్యనేర్పించి, ఆమెనే ఆ పాఠశాలలో ఉపాధ్యాయురాలిని చేసిన మహనీయుడు. తను ఏర్పాటుచేసిన ఆ పాఠశాల, దేశంలోనే మహిళల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడిన పాఠశాలల్లో రెండవది.

- ☞ స్త్రీలతోపాటు బహుజనులకు కూడ విద్యకు గల ఆవశ్యకతను గుర్తించి, విద్యాభివృద్ధి లేనిదే వారి అభివృద్ధిగాని, పర్యవసానంగా సమాజాభివృద్ధిగానీ సాధ్యంకాదని తెలియజేసిన యధార్థవాది.
- ☞ కులవ్యవస్థను, కులవివక్షను, చతుర్వర్ణ వ్యవస్థను, విగ్రహారాధనను, మూఢనమ్మకాలను ఎదిరించిన ధైర్యశాలి.
- ☞ మానవహక్కులు, మానవ సమానత్వం, సామాజికన్యాయం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం లాంటి అంశాలకు గల ప్రాధాన్యత, అవసరాన్ని గుర్తించి, వాటి సాధన దిశగా పలుచర్యలు చేపట్టిన మానవతావాది.
- ☞ శిశుహత్యల నిర్మూలన కొరకు, అనాథల ఆశ్రయం కొరకు, వితంతువుల పునర్వివాహం కొరకు పోరాటం సల్పిన యోధుడు.
- ☞ రైతుల సమస్యల పట్ల, కార్మికుల సమస్యల పట్ల, కర్షకుల సమస్యల పట్ల పోరాటాలు చేపట్టి, వారి సంక్షేమం కొరకు, అభ్యున్నతి కొరకు శ్రమించిన ధీరోదాత్తుడు.
- ☞ సమాజంలోని అణగారిన వర్గాలు కూడా, ఇతర అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా అభివృద్ధి చెందినపుడే సామాజికన్యాయం, సమ సమాజం సిద్ధిస్తాయని జ్యోతిబా ఫూలే ప్రగాఢ విశ్వాసం. అలా అందరూ అభివృద్ధి చెందాలంటే, అందరికీ సమాన అవకాశాలు కల్పించవలెనని గుర్తించి, అణగారిన వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం అవసరమని ఆనాడే గుర్తించిన దార్శనికుడు.
- ☞ సత్యశోధక సమాజాన్ని **(Seekers of Truth)** ఏర్పాటుచేసి, సమాజంలోని అణగారిన వర్గాలను బంధ విముక్తులను చేసి, వారిని దోపిడీ, దుర్మార్గాలకు గురికాకుండా ఉండేందుకు ప్రయత్నించిన దీనజన బాంధవుడు.
- ☞ విప్లవాత్మకమైన సామాజిక సంస్కరణలకు నాంది పలకడమే గాక, కార్యోన్ముఖుడై పలువురికి ఆదర్శప్రాయుడై, స్ఫూర్తి ప్రదాతయైన మహోన్నతవ్యక్తి జ్యోతిబా ఫూలే. కనుకనే ప్రపంచ మేధావులలో ఒకరుగా గుర్తించబడిన డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి గొప్ప వ్యక్తి సైతం జ్యోతిబా ఫూలే తనకు ఆదర్శమని, తన నుంచి ఎంతగానో స్ఫూర్తి పొందానని, ఆయన తనకు గురుతుల్యులని చెప్పడం జ్యోతిబా ఫూలే గారి గొప్పతనానికి ఓ మచ్చుతునక. కనుకనే మహాత్మ జ్యోతిబా ఫూలే గారి జీవితం అందరికీ ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకం మరియు చిరస్మరణీయం. ఆ కారణం చేతనే, జ్యోతిబా ఫూలే తొలి "మహాత్మ" బిరుదాంకితుడయ్యారు.
- ☞ జ్యోతిబా ఫూలే **1890**వ సంవత్సరం నవంబరు నెల **28**వ తేదీన స్వర్గస్థులైనారు.

మహాత్మ జ్యోతిబా ఫూలే గారి ఆశయాల ప్రేరణతో, వాటి సాధన దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు:

మహాత్మ జ్యోతిబా ఫూలే గారి ఆశయాల ప్రేరణతో, వాటి సాధన దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలను చేపట్టినది. వెనుకబడిన తరగతులకు చెందిన వారి విద్యాభివృద్ధికొరకు బి.సి. సంక్షేమశాఖను, ఆర్థికాభివృద్ధికొరకు బి.సి. కార్పొరేషన్‌ను మరియు పలు ఫెడరేషన్‌లను ఏర్పాటుచేయడం జరిగినది.

సమాజంలోని వెనుకబడిన తరగతులను గుర్తించి, రిజర్వేషన్ సౌకర్యమును అందజేయుటకు, బి.సి. కమీషన్‌ను ఏర్పాటుచేసినది. తద్వారా, ఈనాటికి **138** కులాలను వెనుకబడిన తరగతులుగా గుర్తించి, వాటిని ఐదు గ్రూపుల కింద విభజించి **29%** రిజర్వేషన్‌ను కల్పించబడమైనది. వెనుకబడిన తరగతుల అభివృద్ధికొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ముఖ్యంగా **3** రకాలుగా వర్గీకరించవచ్చు. అవి : **1)** విద్యాభివృద్ధి కొరకు సంబంధించినవి **2)** ఆర్థికాభివృద్ధి కొరకు సంబంధించినవి **3)** సామాజికాభివృద్ధి కొరకు సంబంధించినవి

**1. విద్యాభివృద్ధికొరకు :**

1. వెనుకబడిన తరగతులకు చెందిన వారిలో విద్యను పెంపొందించుటకు 1422 సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయడమైనది. తద్వారా 1.70 లక్షలమంది పేద విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం కల్పించబడినది. వసతి గృహాలలో ప్రవేశం కల్పించబడినవారికి, ఉచిత భోజన సదుపాయంతోపాటు సంవత్సరమునకు నాలుగు జతల బట్టలు, బెడ్డింగ్ మెటీరియల్, కాస్మోటిక్ ఛార్జీలు, పాఠ్య పుస్త ములు, నోట్ పుస్తకములు, ప్లేట్లు & గ్లాసులు, స్టడీ మెటీరియల్ మొదలగునవి ఉచితంగా ఇవ్వబడును. 2011-12 వ సంవత్సరంలో వీటి నిర్వహణ కొరకు రూ. 343 కోట్లు కేటాయించడం జరిగినది. గత 5 సంవత్సరములలో వీటి నిర్వహణ కొరకు రూ. 1272 కోట్లు ఖర్చు చేయడం జరిగినది.

2. వెనుకబడిన తరగతులకు చెందిన వారిలో ఉన్నత విద్యను ప్రోత్సహించుటకు, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి ఒకటి చొప్పున 300 కళాశాల బాలికల వసతి గృహాలను, అలాగే ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి ఒకటి చొప్పున 300 కళాశాల బాలుర వసతి గృహాలను ఏర్పాటు చేయడం జరిగినది.

3. కళాశాల విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ మంజూరు చేయడం జరుగుచున్నది. 2008-09వ సంవత్సరం నుండి ఈ పథకములను "శాచ్యురేషన్" పద్ధతిపై అమలు చేస్తూ, మన రాష్ట్రం యావత్ దేశానికే ఆదర్శ ప్రాయమైనది. 2010-11 వ సంవత్సరంలో రూ.1650 కోట్లు ఈ పథకముల క్రింద వెచ్చించి, 13.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధిని చేకూర్చడం జరిగినది. గత 5 సంవత్సరములలో ఈ పథకముల క్రింద రూ. 5458 కోట్లు ఖర్చు చేయడం జరిగినది.

4. ఉన్నత ప్రమాణాల విద్యను అందజేయుటకొరకై, 45 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేయడం జరిగినది. గత 5 సంవత్సరములలో వీటి నిర్వహణ కొరకు రూ. 185 కోట్లు ఖర్చు చేయడం జరిగినది.

5. మహాత్మ జ్యోతిబాపూలే స్త్రీ విద్య ఆవశ్యకతను గుర్తించిన నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, మహిళల విద్యాభివృద్ధి కొరకు పైన తెలియజేసిన వసతి గృహాలలో 620 వసతి గృహాలు ప్రత్యేకించి బాలికలకు కేటాయించడం జరిగినది.

**ఆర్థికాభివృద్ధి కొరకు :**

1. బి.సి. కార్పోరేషన్ మరియు ఫెడరేషన్‌ల ద్వారా ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీము, మార్జిన్ మనీ స్కీము, రాజీవ్ అభ్యుదయ యోజన స్కీము లాంటి వాటి ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుచున్నది. గత 5 సంవత్సరములలో ఈ పథకముల క్రింద రూ. 40.61 కోట్లు ఖర్చు చేసి, 54,862 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది.

2. ప్రభుత్వం ప్రకటించిన ఋణ మాఫీ పథకము క్రింద రూ.361.39 కోట్ల ఋణ బకాయిలను మాఫీచేసి, 12,23,000 మందికి లబ్ధి చేకూర్చడం జరిగినది.

3. ఫెడరేషన్ల ద్వారా గత 5 సంవత్సరములలో రూ.2.50 కోట్లు ఖర్చుచేసి, 4980 మందికి లబ్ధిచేకూర్చడం జరిగినది.

4. చదువుకున్న విద్యార్థులు వారు కోరుకున్న ఉద్యోగాలలో (కెరీర్) స్థిరపడుటకు దోహదం చేయుటకై, 15 స్టడీ సర్కిళ్ళను ఏర్పాటుచేయడం జరిగినది. గత 5 సంవత్సరములలో రూ.23.60 కోట్లు వెచ్చించి, దాదాపు 5వేల మంది విద్యార్థులకు పలురకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. పెక్కుమంది సివిల్ సర్వీసెస్, గ్రూప్ - 1 సర్వీసెస్ లాంటి ఉన్నత పదవులను,ఇతర సర్వీసులలోని పెక్కు ఉద్యోగాలను అధిష్టించుటకు స్టడీ సర్కిళ్ళు ఎంతగానో దోహదం చేస్తున్నాయి.

**సామాజికాభివృద్ధి కొరకు :**

1. కులరహిత, వర్గరహిత, సమసమాజ స్థాపనకొరకు కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ప్రోత్సాహకములు అందచేయటం జరుగుచున్నది. కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు రూ.10,000 నగదు పారితోషకం మరియు ఓ ప్రశంసా పత్రము అందజేయడం జరుగును. గత 5 సంవత్సరములలో రూ.1.65 కోట్లు వెచ్చించి, దాదాపు 1500 మంది కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ప్రోత్సాహకాలు అందించడం జరిగినది.